సీఎం కప్ క్రీడలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

- అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల, అక్టోబర్ 19 : తెలంగాణ సీఎం కప్ 2024 క్రీడలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సీఎం కప్ 2024 పోటీలపై శనివారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లా స్థాయిలో క్రీడలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు. తాసీల్దార్లు, ఎంఈవోలు, పీఈటీలు క్రీడలను నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించి కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. షెడ్యూలు ప్రకారం గ్రామ పంచాయతీ స్థాయిలో పోటీలు అక్టోబర్ 21 నుంచి 24 వరకు, మండల స్థాయిలో అక్టోబర్ 26 నుంచి 30వరకు జిల్లా స్థాయిలో నవంబర్ 8 నుంచి 13వ తేదీవరకు నిర్వహిస్తారని తెలిపారు. నవంబర్ 16 నుంచి 26 వరకు శిక్షణా శిబిరం, నవంబర్ 28 నుంచి డిసెంబర్ 5వ రకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీవో రాంచందర్ అధికారులు వీరభద్రప్ప, ఆనంద్ తాసీల్దార్లు, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ తాసీల్దార్లకు ఆదేశించారు. అదనపు కలెక్టర్ తన చాంబర్‌లో అన్ని మండలాల తాసీల్దార్లతో పెండింగ్ ధరణి దరఖాస్తులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. టీఎం 33, పీవోబీ, పెండింగ్ మ్యుటేషన్, సక్సెషన్ దరఖాస్తులను త్వరగా పూర్తిచేయాలన్నారు. కుల, ఆదాయ సర్టిఫికెట్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు. ఓబీసీ, సర్టిఫికెట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సీఎం గ్రీవెన్స్ ఫిర్యాదులు, ఎక్సగ్రేషియా, ఫ్రీడం ఫైటర్‌కు సంబంధించి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ త్వరగా పరిశీలించి జారీ చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో రాంచందర్, ఏవో భద్రప్ప తాసీల్దార్లు తదితరులుపాల్గొన్నారు.

గ్రూప్-1 అభ్యర్థులపై లాఠీచార్జి దుర్మార్గం

మాట్లాడుతున్న పల్లయ్య

గద్వాల, అక్టోబర్ 19 : గ్రూప్-1 అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడం దుర్మార్గమని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూప్-1 పరీక్షను రీ షెడ్యూలు చేయాలని, తక్షణమే జీవో నెంబర్ 29ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 అభ్యర్థులపై కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షసంగా వ్యవహరిస్తుందన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువతులపై దుర్మార్గంగా వ్యవహరించడం ప్రజలు క్షమించరని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అశోక్‌నగర్‌కు వచ్చిన రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి అక్కడ అడ్డ గోలు హామీలు ఇచ్చి ఇప్పుడు పత్తాలేకుండా పోయారని ఆరోపించారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులకు బీఆర్ఎస్ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. అభ్యర్థులు చేస్తున్న ఆందోళన న్యాయమైందన్నారు. గతంలో తెలంగాణ సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన జీవో 55ను కొనసాగించాలని ఆజీవో ప్రకారమే ఉద్యోగాల భర్తీ చేయాలన్నారు. కుట్రపూరితంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29 రద్దు చేయాలని లేకుంటే తెలంగాణ ప్రాంత బిడ్డలకు తీవ్రమైన అన్యాయం జరిగే పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు మాధవ్, భువన్, బషీర్, తాంజిల్, సల్మాన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో గుణాత్మక విద్య

- డీఈవో గోవిందరాజులు

విగ్రహానికి భూమిపూజ చేస్తున్న డీఈవో

పెబ్బేరు, అక్టోబర్ 19 : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన, గుణాత్మక విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు డీఈవో గోవిందరాజు అన్నారు. పెబ్బేరు మండలం యాపర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయతలపెట్టిన సరస్వతీ దేవీ విగ్రహానికి శనివారం ఆయన భూమిపూజ చేశారు. అలాగే, పేరెంట్స్ మీటింగ్‌ను పరిశీలించిన ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయి పాఠశాలలను తీర్చిదిద్దేందుకు, విద్యార్థుల సంఖ్య పెంపుదలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. యాపర్ల పాఠశాలను దత్తత తీసుకొని అభివృద్ధి పనులను చేపడుతున్న ఎన్ఆర్ఐ శ్రీహరిరెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శంకర్‌గౌడ్, కాంప్లెక్స్ హెచ్ఎం నర్సింహారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★ I, **PATANGE BALA KRISHNA RAO**, S/o: **PATANGE NARAYANA RAO**, R/o: 3-8-15/1, Ravindra Nagar, Mahabub Nagar -509001, Changed my name as **PATANGE BALA KISHAN RAO**
NT-MBNR

WANTED
★Req. Cashier, Female Waiter, South Indian Lunch & Tandoori Master, Housekeeping for Restaurant @ AS Rao Nagar. 9393123493, 7995900498.
NT-334839-All

WANTED PLOTS
★హైదరాబాద్, హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, పసుమాముల, అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం, శ్రీమిత్ర, జనవైతన్య, గ్రీన్‌సిటీ, మౌంట్ ఒపేరా, సింగరేణికాలనీలో ప్లాట్లు కొనబడును. No Broakers. 9553973999 / 6303049720.
NT-336725-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

క్రీడల్లో విద్యార్థులు, యువత రాణించాలి

- కలెక్టర్ సంతోష్

గద్వాల, అక్టోబర్ 19 : గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడల్లో విద్యార్థులు, యువత రాణించాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. శనివారం సీఎం కప్ 2024 టార్చ్‌ని సంగాల పార్క్ వద్ద వెలిగించి కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. టార్చ్ ర్యాలీకి యువత పెద్దఎత్తున హాజరయ్యారు. ర్యాలీ సంగాల పార్కు నుంచి కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. పల్లె నుంచి ప్రపంచస్థాయి వరకు క్రీడాకారులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సీఎం కప్ 2024పై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా టార్చ్ ర్యాలీ నిర్వహిస్తుందని తెలిపారు. సీఎం కప్ కార్యక్రమం ద్వారా గ్రామ, మండల, జిల్లాస్థాయిలో మంచి నైపుణ్యత ప్రదర్శించిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి, అంతర్రాష్ట్రస్థాయిలో ఒలింపిక్స్‌లో వెళ్లే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. ఇటీవల ఒలింపిక్స్‌లో పాల్గొన్న నిఖత్ జరీన్, టీ20 క్రికెట్ వరల్డ్‌కప్ విజేత మహ్మద్ సిరాజ్ వంటి క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించి డీఎస్పీ స్థాయిలో నియామకాలు ఇచ్చిందని గుర్తుచేశారు. మానసిక ఆరోగ్యం ఎంత ముఖ్యమో, శారీరక ఆరోగ్యం అంతే ముఖ్యమని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ సీఎం కప్-2024 ప్రధానంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ప్రతి క్రీడాకారుడికి తగిన అవకాశాలు పొందేలా చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయిలో జరగబోయే పోటీల్లో గద్వాలకు చెందిన క్రీడాకారులు ఎంపిక కావాలన్నారు. అనంతరం ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడలు వ్యక్తి శారీరక ఆరోగ్యం, మానసిక ధృఢత్వాన్ని మెరుగుపరుస్తుందన్నారు. క్రీడల్లో ప్రావీణ్యం ఉన్న వారికి పోలీస్‌శాఖలో ప్రవేశించడం సులభమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, బెటాలియన్ డీఎస్పీ రఘునాథ్ చౌహాన్, జిల్లా క్రీడా అధికారి ఆనంద్ అధికారులు పాల్గొన్నారు.

గద్వాల జిల్లా కేంద్రంలో ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఎల్ వోసీ అందజేత

మల్దకల్ మండలంలోని బిజ్వారం గ్రామానికి చెందిన బొజ్జన అనారోగ్యానికి గురై మెరుగైన వైద్య సాయం కోసం సీఎం సహాయనిధి దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ప్రభుత్వం నుంచి రూ.లక్షా 50వేల ఎల్‌వోసీ మంజూరు కాగా జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమన్నారు.

రైతు కుటుంబాలకు అండగా ప్రభుత్వం

రైతు కుటుంబాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో కేటీదొడ్డి మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు రాథయ్య అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబానికి మంజూరైన రైతు బీమా చెక్కును భార్య అరుణమ్మకు శనివారం ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గడ్డంకృష్ణారెడ్డి, రామన్ గౌడ్, రాజశేఖర్, మురళి, ఆంజనేయులు, గోపి పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగించుకునేలా చూడాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, అక్టోబర్ 19 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలైన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజనలను ప్రజలు సద్వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల నమోదు ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. వీటిపై బ్యాంకర్లు దృష్టి సారించాలని సూచించారు. బ్యాంక్ ఖాతాలు ఉన్న వారంతా ఈ బీమా పథకాలకు అర్హులేనని వారందరికి ఈ బీమా పథకాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఖాతాదారుడి ఇంటికి వెళ్లి వారికి ఈ బీమా పథకాలను వివరించి నమోదు చేసుకునేలా చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శితో సమన్వయం చేసుకొని ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పథకానికి కేవలం సంవత్సరానికి రూ.430కడితే రూ.2లక్షల జీవిత బీమా వస్తుందని, అదేవిధంగా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో ఏడాదికి కేవలం రూ.20 చెల్లిస్తే ప్రమాదం సంభవించినప్పుడు పాక్షిక అంగవైకల్యం ఏర్పడితే రూ.లక్ష, శాశ్వత అంగ వైకల్యం ఏర్పడితే రూ.2లక్షల బీమా వస్తుందని అవగాహన కల్పించాలన్నారు. అయితే బ్యాంకర్లు స్పందిస్తూ ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభించామని బదులిచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలపై మాట్లాడుతూ 2018-19లో ఎస్సీ శాఖ ద్వారా మంజూరైన 58సబ్సిడీ రుణాలు గ్రౌండింగ్ కాకపోవడానికి గల కారణాలు ఏంటని బ్యాంకర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీని ప్రశ్నించారు. ఆయా రుణాలు వేగంగా గ్రౌండింగ్ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిరిజనుల ఆర్థికాభ్యున్నతికి 80శాతం రాయితీపై ప్రభుత్వం ఏటా టైకార్ (ట్రైబల్ కార్పొరేషన్)రుణాలు కేటాయిస్తుందని, అందులో భాగంగా జిల్లాలో ఇంకా పెండింగ్‌లో ఉన్న రుణాలను గ్రౌండింగ్ చేయించే విధంగా దగ్గరుండి చర్యలు తీసుకోవాలని గిరిజన శాఖ అధికారిని ఆదేశించారు.

బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

పీఎంఈజీపీ రుణాలను వినియోగించుకోవాలి

ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ) కింద నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి వారి జీవన ప్రమాణాలు పెరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. యువత ఎవరైనా సేవా, పరిశ్రమ రంగాల్లో రాణించేందుకు ఆసక్తి ఉంటే పీఎంఈజీపీ పథకాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పీఎంఈజీపీ కార్యక్రమం కింద వ్యాపార యూనిట్లు పెట్టేవారికి 34శాతం సబ్సిడీ అందుతుందని చెప్పారు. ఎవరైనా యూనిట్లు పెట్టడానికి సిద్ధంగా ఉంటే కలెక్టరేట్‌లోని ఇండస్ట్రీస్ శాఖ అధికారి నగేశ్ 83329 04444 నెంబర్ లేదా లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీవో ఉమాదేవి, గిరిజన శాఖ అధికారిణి సుషిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిశోర్‌పాండే, ఇండస్ట్రీస్ ప్రమోషన్ ఆఫీసర్ నగేశ్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

నిత్యానందరావు నియామకంపై హర్షం

వనపర్తి టౌన్, అక్టోబర్ 19 : ఆచార్య వెలుదండ నిత్యానందరావు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా నియమించడంపై వనపర్తి జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్‌మాట్లాడుతూ అధ్యాపకుడిగా ఆచార్యుడిగా నాలుగు దశాబ్దాలపాటు ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో సేవలందించారన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడమే కాక ఎంతో మంది పీహెచ్‌డీ, ఎంఫిల్ విద్యార్థులకు పర్యవేక్షకుడిగా వ్యవహరించారని తెలిపారు. ఆయన నియామకంపై సాహితీ మిత్రులు జన జ్వాల, కందూరు నారాయణరెడ్డి, బైరోజు చంద్రశేఖర్, డాక్టర్ తూర్పింటి నరేష్‌కుమార్, డాక్టర్ శ్యాంసుందర్, డాక్టర్ భానుప్రకాశ్, బండారు శ్రీనివాస్, ఉన్నారు.

నేడు వనపర్తికి ఎస్‌బీఐ చైర్మన్ చల్లా రాక

వనపర్తి, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జాతీయ చైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి ఆదివారం వనపర్తికి రానున్నారు. గతంలో ఇక్కడి బ్యాంక్‌లో మేనేజర్‌గా పని చేసిన చల్లాకు ఈ ప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. చైర్మన్‌గా నియామక వైభవ తర్వాత తొలిసారిగా చల్లా వనపర్తికి వస్తున్నారు. అయితే ముందుగా పాత మార్కెట్‌యార్డులో గణేశ్ ఆలయంలో జరిగే హోమంలో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం నుంచి ఎస్‌బీఐ అధికారులు, ఇతర ఉద్యోగులతో సమావేశం కానున్నారు. కాగా, ఎస్‌బీఐ జాతీయ చైర్మన్ హోదాలో వస్తున్న అధికారిక కార్యక్రమం అని చెబుతున్నా జిల్లా కేంద్రంలో ఉన్న అధికారులు మాత్రం ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. స్థానిక డీపీఆర్‌వో, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజరులను సంప్రదించినా తమకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు.

జమిలి ఎన్నికలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డీ జబ్బార్

వనపర్తి టౌన్, అక్టోబర్ 19 : జమిలి ఎన్నికలు సమాఖ్య స్ఫూర్తిగా విరుద్ధమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డీ జబ్బార్ అన్నారు. సీపీఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర క్యాబినేట్ ఇటీవల అమోదించిన ఒకే దేశం ఒకే ఎన్నిక భావనను సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. పార్లమెంట్, శాసనసభ, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి తీసుకునే చర్యలు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు, సమైక్య వ్యవస్థకు విఘాతం కలిగిస్తాయన్నారు. రాష్ట్రాల శాసనసభకు ఐదేండ్ల కాలపరిమితి కల్పిస్తున్న రాజ్యాంగాన్ని ఇది ఉల్లంఘిస్తుందన్నారు. దేశం మొత్తం ఒకేసారి 2027ఫిబ్రవరిలో జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఈ ప్రయత్నాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. జమిలి ఎన్నికలు అంటే రాజ్యాంగంలో 5 ఆర్టికల్స్ (ఆర్టికల్స్ 83,85, 172,174,356)లు రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా ఆమోదించడానికి లోక్‌సభ, రాజ్యసభలలో 67శాతం మంది సపోర్ట్ చేయాలని, ఈబిల్లు 2024 శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు. రాష్ట్రాల హక్కులను జమిలీ ఎన్నికలు కాలరాస్తాయని ఎన్నికలను తిరస్కరించాలన్నారు.

ఎంపీవో గా రాజశేఖర్

మల్దకల్, అక్టోబర్ 19 : మల్దకల్ ఎంపీవోగా రాజశేఖర్ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టాడు. ఆయన కేటీదొడ్డి మండలం నుంచి ఇక్కడి వచ్చినట్లు ఎంపీడీవో ఆంజనేయరెడ్డి తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న చెన్నయ్య గట్టు ఎంపీడీవోగా బదిలీపై వెళ్లాడు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, అక్టోబర్ 19 : పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని పోలీస్ అధికారులకు ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శనివారం నేర సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ నేరస్తులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా చూడాలని అప్పుడే నేరాలు తగ్గుతాయన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్‌క్రైంపై అవగాహన, మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు, సైబర్ క్రైం పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, సైబర్‌నేరాలపై అప్రమత్తత, బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు.

ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, రివార్డులు అందజేస్తున్న ఎస్పీ గిరిధర్

ప్రశంసా పత్రాలు, రివార్డులు

విధి నిర్వహణలో మెరుగైన సేలందించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని కొనియాడుతూ ఎస్పీ ప్రశంస పత్రాలు, రివార్డులు అందజేశారు. ఎస్సైలు రవిప్రకాశ్, రామకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ సంజీవయ్య, మురళీకృష్ణ, రాంగోపాల్ వర్మ, స్వామి ప్రశంసాపత్రాలు, రివార్డులు అందుకున్నారు.

21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ ప్లాగ్‌డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. అక్టోబర్ 21నుంచి 31వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు ఉంటాయని ప్రజలు, విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్పీ తెలిపారు. ఈనెల 21 నుంచి 24వరకు ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహిస్తామని, విద్యార్థులకు ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ భాషల్లో ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. ఇందులో కేటగిరి 1లో మొబైల్ వాడకం, కేటగిరి 2లో డిగ్రీ, పై చదువులు వారికి తెలంగాణ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో మా పాత్ర అనే అంశాలపై వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. అదేవిధంగా రక్తదాన శిబిరం, షార్ట్ ఫిలీం, ఫొటోగ్రఫీ పోటీలు ఉంటాయని చెప్పారు.

వాహనాల నిర్వహణ పోలీస్ శాఖ గౌరవం పెంచేలా ఉండాలి

వనపర్తి టౌన్, అక్టోబర్ 19 : పోలీస్ శాఖ గౌరవం, ప్రతిష్ట పెంచే విధంగా పోలీసుల వాహనాల నిర్వహణ ఉండేలా డ్రైవర్లు మరింత క్రమశిక్షణతో విధి నిర్వహణ చేయాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎంటీ విభాగం శ్రీనివాస్ నేతృత్వంలో శనివారం నిర్వహించిన పోలీస్ వాహనాల తనిఖీ, వాహనాల డ్రైవర్లకు శిక్షణ అవగాహన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. డ్రైవర్లంతా లైసెన్స్ కలిగి ఉండాలని, పోలీస్‌శాఖ గౌరవం మీ చేతుల్లో ఉందనే విషయం గుర్తుంచుకొని, క్రమశిక్షణతో విధి నిర్వహణ చేస్తూ వాహనాల నిర్వహణ సక్రమంగా చేయాలని సూచించారు. అతివేగంతో వెళ్లకూడదని, ప్రతిఒక్కరూ వాహనాన్ని తమ సొంత వాహనం లాగా చూసుకుంటూ శుభ్రంగా ఉంచుతూ పోలీస్‌శాఖ క్రమశిక్షణ ప్రతిబింబించేలా చూడాలన్నారు. ఘటనా స్థలానికి వెళ్లే సమయం, ఎస్కార్ట్, నేర పరిశోధ ప్రాంతాలకు వెళ్లే సమయంలోనూ సామర్థ్యానికి అనుగుణంగా వాహనాలను నడపాలని, నిర్దేశించిన వేగం మించకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. పోలీస్ స్టేషన్ల వారీగా వాహనాలను ఎంటీఆర్ఐ పరిశీలించి నివేదిక అందజేయాలని ఎస్పీ సూచించారు. వాహనాల నిర్వహణ సరిగా లేని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల నిర్వహణ సరిగా చూసుకున్న పోలీస్ వాహన చోధకులకు ఎస్పీ ప్రశంసాపత్రాలు, రివార్డులు అందజేశారు. వారిలో శివకుమార్‌గౌడ్ ఎఆర్‌హెచ్-7 డీఎస్పీ కార్యాలయం, రామాంజనేయులు హెచ్‌జీ-383 కొత్తకోట పోలీస్‌స్టేషన్, శ్రావణ్‌కుమార్ హెచ్‌జీ-834 జిల్లా ఘణపురం పోలీస్‌స్టేషన్ ఉన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్, ఏఆర్ అదనపు డీఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీసీఆర్బీ డీఎస్పీ కృష్ణకిశోర్, సీఐ నాగ భూషణ్‌రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం

గద్వాల(ఉండవెల్లి), అక్టోబర్ 19 : ఉండవెల్లి మండలం కలుగోట్ల కేజీబీవీ విద్యార్థినుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తాగునీటి ఆర్‌వో ప్లాంట్‌ను శనివారం ఎంఈవో శివప్రసాద్, ఎస్‌వో పరిమళ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థినుల తల్లిదండ్రులు, రైతుసంఘం నాయకులు అందజేసిన రూ.లక్ష విరాళాలతో ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రైతు సంఘం నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ చూపాలి

పాన్‌గల్,అక్టోబర్19: విద్యార్థుల ప్రగతి, పురోభివృద్ధిలో తల్లిదండ్రులు ప్రత్యేకశ